

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## గిల్టీ

**తలుపు చప్పుడు విని,** వంటగదిలో తలమునకలుగా ఉన్న వారిజ జుట్టు సర్దుకుంటూ వచ్చి తలుపు తీసింది. ఎదురుగా భర్త వయసే ఉన్న ఒకతను సందేహంగా అడిగాడు.

"శ్రీకాంత్ ఉన్నాడాండీ?"

"ఉన్నారు. రండి. కూర్చోండి" అడ్డుతొలిగింది.

అతను లోపలికి వచ్చి కూర్చుని టీపాయ్ మీద ఉన్న ఈనాడుని చేతిలోకి తీసుకున్నాడు.

"ఎవరు?" డ్రెస్ చేసుకుంటున్న శ్రీకాంత్ అడిగాడు.

"ఏమో? మీకోసమే వచ్చారు."

శ్రీకాంత్ డ్రాయింగ్ రూంలోకి వచ్చి అతనితో కరచాలనం చేస్తూ చెప్పాడు.

"సారీ రాజీవ్. కొద్దిగా లేటయాను."

"పర్లేదు. బయలుదేరదామా?" రాజీవ్ గడియారం వంక చూస్తూ అడిగాడు.

"వారిజా - ఇతను రాజీవ్. మా బ్రాంచ్‌లోనే పని చేస్తున్నాడు. వీళ్ళ ఇల్లు మనింటికి దగ్గర్లోనే. ఇవాల్టినుంచి ఇద్దరం బైక్ పూల్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాం" శ్రీకాంత్ నవ్వాడు.

"అంటే?" వారిజకి అర్ధం కాలేదు.

"అంటే, పెట్రోల్ ఆదా చేద్దామని ఒక నెల ఒక బైక్, ఇంకో నెల ఇంకొకరి బైక్ మీద ఆఫీస్‌కి వెళ్దాం అనుకుంటున్నాం. ఈనెల రాజీవ్ వంతు" వివరించాడు.

వారిజకి ఈసారి అర్ధమైంది.

"ఒక్క నిమిషం బాక్స్ తెస్తాను." వంటగదిలోకి పరిగెత్తింది.

***

"వారిజా!" పెద్దగావు కేక వినిపించి హడిలిపోయి బయటకి వచ్చింది.

"ఈ రెండూ ఒకే రంగులో ఉన్నాయా?" రెండు సాక్స్‌ని రెండు చేతులతో పట్టుకుని ఉగ్రంగా అడిగాడు శ్రీకాంత్.

వారిజ కొద్దిగా తడబడింది. కొత్త వ్యక్తి ముందు ఆ అరుపులు ఆమెకి అవమానంగా ఉన్నాయి.

"పనిమీద శ్రద్ధ లేకపోతే నాకు కోపం అని నీకు తెలుసు. ఒకదాన్ని తెల్లగా ఉతికి, ఇంకో సాక్స్‌ని అలా మురికిగా వదిలేసావే? పాపం అదేం పాపం చేసింది? ఏం ఆ సమయంలో నీ ఫ్రెండ్ ఫోన్ చేసిందా?" అనర్ఘళంగా తిడుతూనే ఉన్నాడు శ్రీకాంత్.

ఆమె తలవంచుకుని నిలబడి పోయింది. ఎదురు మాట్లాడితే ఇంక ఎంత యుద్ధం జరుగుతుందో తెలుసు. 'ఛ! ఏమిటి అతని ముందు' అని కోపంగా అనుకుంది.

"పర్లేదు శ్రీకాంత్. రండి. మీ సాక్స్ ఎవరూ చూడరులెండి" రాజీవ్ మృదువుగా పిలిచాడు.

శ్రీకాంత్ చేతిలోని సాక్స్‌ని ఉండచుట్టి మూలకి విసిరేసాడు. ఆ చర్య అర్ధమైన వారిజ గబగబా బీరువాలోంచి కొత్త సాక్స్ జతని తెచ్చి ఇచ్చింది. ఎర్రబడిన మొహంతో శ్రీకాంత్ షూ వేసుకుని రాజీవ్‌తో బయటకి నడిచాడు.

తలుపు లోపల నుంచి వేసుకుని వారిజ ఆవేశంతో ఆ సాక్స్ ఉండలని దూరంగా పడేలా తన్నింది. 'దుర్మార్గుడు, దుష్టుడు నీచుడు' పైకే గట్టిగా అరిచింది. ఉక్రోషంతో పెద్దగా ఏడ్చింది. తర్వాత ఆకలేసి అన్నం తినేసి నిద్రపోయింది.

సాయంత్రం నాలుగు అవగానే గంట కొట్టినట్లుగా ఆమెకి మెలుకువ వచ్చేసింది. మరో గంటన్నరలో శ్రీకాంత్ వచ్చేస్తాడు. గబగబా లేచి ఇల్లంతా శుభ్రంగా సర్దేసింది. వంట చేసి ఓ కప్పు కాఫీ తాగి స్నానం చేసి కాటన్ చీర కట్టుకుని తల దువ్వుకుని పౌడర్ రాసుకుంటూ అద్దంలో చూసుకుంది. అందంగా, ముద్దుగా ఉంది ముఖం.

'ఇంత అందమైన అమ్మాయిని తిట్టడానికి మనసెలా వస్తుందో' అనుకుంది.

ఐదున్నరకి బెల్ మోగింది. తలుపు తీసింది. రాజీవ్‌కి 'బై' చెప్పి శ్రీకాంత్ లోపలకి వచ్చాడు. బూట్లు విప్పి చెప్పుల అలమర తీసి అందులో పొందికగా పెట్టి తలుపు జాగ్రత్తగా మూసాడు. స్లిప్పర్స్ వేసుకుని బాత్ రూంలోకి వెళ్ళి స్నానం చేసి వచ్చి చెప్పాడు.

"వారిజా ఆకలి ఏమైనా పెడతావా?"

ఆమెతో కబుర్లు చెప్తూ టిఫిన్ తిని ప్లేట్‌ని సింక్‌లో పెట్టి చేతులు కడుక్కుని నేప్‌కిన్ తుడుచుకుంటూ చెప్పాడు.

"నువ్వు మనసు పెట్టి చేస్తే చాలా బాగా చేస్తావు వారిజా. కానీ నీకు తగని బద్ధకం."

"ఐనా పొద్దున ఆ రాజీవ్ ముందే తిట్టారుగా?" ఉడుక్కుంది.

"నేను నీకు పెళ్ళికి ముందే చెప్పాను. నేను పర్‌ఫెక్షనిస్ట్‌ని. అన్నీ క్రమపద్ధతితో సాగాలి. లేదంటే పిచ్చికోపం వస్తుందని. పెళ్ళయి రెండేళ్ళయినా నీ తీరు మారలేదు. అదే బద్ధకం, అదే నిర్లక్ష్యం. మరి నాకు కోపం రాదా చెప్పు?" అనునయంగా అడిగాడు.

అది నిజమే అయినా, అది నిజం అని ఒప్పుకోడానికి వారిజకి అహం అడ్డొచ్చి మౌనంగా ఉండిపోయింది.

అన్నంలో వెంట్రుక వచ్చిందని ఆమె నిర్లక్ష్యాన్ని ఇష్టమొచ్చిన భాషలో తిట్టి, ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు శ్రీకాంత్. విపరీతమైన కోపంతో అతన్ని బండబూతులు తిట్టుకుని, అతను విష్ణుచక్రంలా విసిరేసిన పళ్ళెంలోంచి ఇల్లంతా చిమ్మిన అన్నం మెతుకులని ఊడ్చి ఎత్తి ఆయాస పడిపోయింది వారిజ. తర్వాత ఇల్లంతా శుభ్రంగా డెట్టాల్‌తో తుడిచింది. ఆమె మనస్సు క్రోధంతో రగిలిపోతోంది. మళ్ళీ స్నానం చేసి అన్నం తిని మంచం మీద నడుం వాల్చేసరికి ఫోన్ మోగింది.

కొత్త నంబర్.

"హలో. ఎలా ఉన్నారు? భోజనం చేసారా?" ఓ మగ కంఠం మృదువుగా వినిపించింది.

"మీరు?"

"నేను రాజీవ్‌ని."

అర నిమిషం నిశ్శబ్దంగా ఉండిపోయింది వారిజ.

"సారీ. రోజూ శ్రీకాంత్ మిమ్మల్ని అలా అరుస్తూంటే నాకు ఎంత బాధగా ఉంటోందో తెలుసా?"

ఈ చిన్న ఓదార్పుకి వారిజకి దుఃఖం ముంచుకొచ్చింది.

"అయ్యో ఏడవకండి. మీ అందమైన కళ్ళకి కన్నీళ్ళు సూట్ కావు." నవ్వాడు.

"మీరెందుకు ఫోన్ చేసారు?" ముక్కు ఎగపీలుస్తూ అడిగింది.

"ఊరికే. చాలా రోజుల నుంచి మీతో మాట్లాడాలని ఉంది. కానీ ఏమనుకుంటారో అని మాట్లాడలేదు. కానీ ఇవాళ శ్రీకాంత్ పాపం మీ మీద ఆ పళ్ళాన్ని అలా విసిరేస్తే అయ్యో అనిపించింది. ఇంక ఉండబట్టలేక కాల్ చేసాను. "అతని గొంతులో అదే మార్దవం.

ఆమెకి మళ్ళీ ఉప్పెనలా దుఃఖం పొంగుకొచ్చింది.

"నీలాలు కారేనా కాలాలు మారేనా? నీ బాధనే పంచుకోనా?" రాగం తీసాడు.

కన్నీళ్ళు తుడుచుకుంటూ కిలకిలా నవ్వింది వారిజ.

"రోజూ సాయంత్రాలు మీరు తలుపు తీసే దాకా నేను వెళ్ళకుండా శ్రీకాంత్‌తో ఎందుకు కబుర్లు చెప్తానో తెలుసా?" అడిగాడు.

"అవును. ఎందుకు? ఆయన్ని డ్రాప్ చేసి వెళ్ళకుండా ఆగుతారు?" కుతూహలంగా అడిగింది.

"మీకోసమే. తెల్లని మెత్తని కాటన్ చీరలో మీరు దేవతలా వచ్చి తలుపు తీస్తారు" గుసగుసగా చెప్పాడు.

పెళ్ళయి రెండేళ్ళయిన వారిజ అతని కంఠంలోని తేడాని ఇట్టే పసికట్టింది. దాన్ని గమనించనట్లుగా చెప్పింది.

"శ్రీకాంత్‌కి నైటీ వేసుకుంటే ఇష్టం ఉండదు."

"ఈ ఒక్క విషయంలో అతను నాకు నచ్చాడు. మీ అద్భుతమైన ఆకృతికి నైటీని తొడిగితే ఎలా ఉంటారో తెలుసా? ఆవిష్కరణకి ముందు శిలా విగ్రహానికి ముసుగుతొడిగినట్లు లోపలి అందాలు తెలీకుండా."

అతని చనువుకి ఆమె కొద్దిగా ఇబ్బంది పడి చెప్పింది.

"నాకు పనుంది."

"ఓకే..ఓకే. రేపు ఇదే టైంకి మాట్లాడుకుందాం. బై"

ఫోన్ పెట్టేసాక వారిజ చాలాసేపు అలా కూర్చుండిపోయింది. ఆమె ఎదురు చూడని ఆ ఫోన్ కాల్ ఆమెని కుదిపేసింది. పెళ్ళికి ముందు, చదువుకునేప్పుడు ఆమెకి ఇలాంటి అనుభవాలు లేవు. చాలా బుద్ధిగా కాలేజ్‌కి వెళ్ళి చదువుకుంది. ఒకబ్బాయి చేతిలో ప్రేమలేఖ పెడితే భయంతో వణికిపోయి దాన్ని తెచ్చి తండ్రి చేతిలో పెట్టింది. ఆయన ఆ వేసవిలో ముహూర్తాలు పెట్టించి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ బాంక్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీకాంత్‌తో కూతురి పెళ్ళి చేసి అల్లుడితో రైలెక్కించి అమ్మయ్యా అని గుండెల మీద చేతులుంచుకున్నాడు.

ప్రతీది పద్ధతి ప్రకారం పర్‌ఫెక్ట్‌గా జరగాలి అనే శ్రీకాంత్‌తో పెళ్ళికి ముందు ఒక్క పనీ చేతకాని వారిజ అడ్జస్ట్ కాలేకపోయింది. భార్యని ఎంత ప్రేమగా చూసుకున్నా పొరపాటు జరిగితే క్షమించడం అనే పదం తెలీని శ్రీకాంత్ మీద ఆమెకి అనురాగం, ప్రేమ కలగలేదు. పులిగుహలో బతుకుతున్నట్లు క్షణం క్షణం భయపడుతూ, ప్రేమలేఖ రాసినవాడిని తిట్టుకుంటూ, చదువు మాన్పించి పెళ్ళిచేసిన తండ్రిని, వంతపాడిన తల్లిని జన్మలో క్షమించను అనుకుంటూ కాలం గడుపుతున్న వారిజకి రాజీవ్ ఎడారిలో ఒయాసిస్‌లా కనిపించాడు.

మర్నాడు ఆమె మనసు ఆమెకి తెలియకుండానే అతని ఫోన్‌కాల్ కోసం ఎదురుచూడసాగింది. సరిగ్గా నిన్న సమయానికే ఫోన్ మోగింది. వెంటనే ఆన్సర్ చేస్తే ఆత్రం అనుకుంటాడేమోనని నాలుగు రింగుల తర్వాత ఆన్ నొక్కి చెప్పింది.

"హలో."

"హలో... అమ్మయ్య. ఇంట్లో ఎవరైనా ఉన్నారేమో అందుకని ఫోన్ తీయడం లేదని ఇప్పుడే పెట్టేయబోతున్నాను." అతని కంఠంలో ఆనందం.

"లేదు. ఈ సమయంలో మా ఇంట్లో ఎవరూ ఉండరు. కిచెన్‌లో పనిలో ఉన్నా" అబద్ధమాడింది.

"పొద్దున మీరు ఎంత బావున్నారో తెలుసా? ఎర్రటి చీరలో మందారంలా ఉన్నారు" అతను గుసగుసగా చెప్పాడు.

అతనికోసం ఒక అరగంట ముందే లేచి శ్రద్ధగా తయారైన వారిజ ఆ ప్రశంసకి పులకించిపోయింది.

"శ్రీకాంత్ ఎప్పుడూ మెచ్చుకోరు" ఫిర్యాదు చేస్తున్నట్లుగా చెప్పింది.

"అతనికి కావలసింది అందమైన భార్యకాదు. చెప్పినట్లు చేసే రోబో. రోబోల అందాలని ఎవరైనా పరిశీలిస్తారా?" నవ్వాడు.

అతను దాదాపు అరగంటసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసాడు. వారిజకి తను చేసేది తప్పో, ఒప్పో అర్థం కావటం లేదు. ఈ పరిచయం ఎంత దూరం పోతుంది? దాని పర్యవసానం ఏమిటి అని ఆలోచించడానికి భయపడి, ఆ ఆలోచనలని రాకుండా కంట్రోల్ చేసుకుంటోంది.

కానీ రాజీవ్ పరిచయంతో ఆమెకి రోజులు చాలా ఉత్సాహంగా గడుస్తున్నాయి.

కాలింగ్ బెల్ మోగింది.

'సరిగ్గా రాజీవ్ ఫోన్ చేసే సమయానికి ఎవరు?' విసుక్కుంది వారిజ. ఆమె అతని ఫోన్ కాల్స్‌కి ఎంత బానిస అయిందంటే, ఆదివారాలు విలవిలాడిపోతోంది. సిగరెట్, ఆల్కహాల్‌లాగా ఆమెకి అతని ఫోన్ కాల్స్ వ్యసనమైపోయాయి. తల్లి వస్తానని ఫోన్ చేస్తే రావద్దని నిర్దాక్షిణ్యంగా చెప్పేసింది. రోజుకో అరగంట ఊహాలోకంలో తన కలల రాకుమారుడితో విహరించి, ఎన్నో అనుభూతులు పంచుకుని వారిజ దాదాపు ఉన్మత్త స్థితిలో ఉంది. గోడగడియారం వైపు చూసి తలుపు తీసింది.

ఎదురుగా రాజీవ్. ఆమె గుండె ఝల్లుమంది. కబుర్లు ఎన్ని చెప్పినా ఆమె మనసు ఇంకా అతనితో ఏకాంతానికి సిద్ధపడలేదు.

"రండి" తడబడుతూ చెప్పింది.

అతను లోపలకి వచ్చి తలుపు మూసి బోల్ట్ వేసి చెప్పాడు.

"దాదాపు నెలరోజుల నుంచి మీ ఇంటికి వస్తున్న డ్రాయింగ్ రూం తప్పించి బెడ్‌రూం చూడలేదు. చూపిస్తారా?"

"బేంక్ లేదా?"

"లేకపోతే మీ పతిదేవుడు కూడా వచ్చేవాడు కదా? హాఫ్‌డే లీవ్ పెట్టాను. నిజానికి సరిపోదు. కానీ ఏం చేస్తాం? సరిపెట్టుకుందాం"

వారిజకి కంగారుగా ఉంది. అతన్నించి ఈ చొరవని ఆమె ఎదురు చూడలేదు. అతను స్వతంత్రంగా, ఓరగా తలుపు వేసి ఉన్న గదిలోకి నడిచాడు. ఆమె అసంకల్పితంగా అతని వెనకే వెళ్ళింది.

తెల్లటి దుప్పటి పరిచి, ఒక్క మడతకూడా లేకుండా శుభ్రంగా కనపడుతున్న మంచాన్ని చూసి 'వావ్' అని కూర్చున్నాడు రాజీవ్. శ్రీకాంత్ ఆఫీస్ నుంచి వచ్చాక శుభ్రంగా స్నానం చేసి కానీ బెడ్ మీద కూర్చోడు. అలాగే అతనికి బయటివారు తమ బెడ్ రూంలోకి రావడం ఇష్టం ఉండదు. ఐనా తనకి రాజీవ్ మీద కోపం రావడం లేదే? అనుకుంది వారిజ.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? ఇలారా" చేతిని చూస్తూ పిలిచాడు రాజీవ్.

ఆమె ఆ సంబోధనకి ఉలిక్కిపడింది. 'నువ్వు' అని ఏకవచనప్రయోగం చేసాడు. ఇంతకాలం ఫోన్‌లో మాట్లాడుతున్నా మీరు అనేవాడు. మరి? అతనికి ఆ చనువు తానే ఇచ్చిందా?

"అసలే టైం తక్కువ ఉంది. రమ్మంటున్నానా?" అతను లేచి ఆమెని మంచం మీదకి లాగి, ఆమె మీదకి వంగి బుగ్గన ముద్దుపెట్టుకున్నాడు. అతని ఒంటి నుంచి స్వల్పంగా చెమటవాసన, నోటి నుండి ఘాటైన వెల్లుల్లివాసన. బుగ్గల మీద అలవాటు లేని మీసాల స్పర్శ.

ఒక్క ఉదుటన అతన్ని వెనక్కి నెట్టి లేచి బయటకి పరిగెత్తింది వారిజ. సోఫాలో కూలబడింది. వెనకే అతను వచ్చాడు.

"వద్దు. వెళ్ళండి" స్థిరంగా చెప్పింది.

"అదేంటి? నీకిష్టమేగా?" అతను తెల్లబోయాడు.

"లేదు.. లేదు.. నాకిష్టం లేదు."

"మరి నేను చెప్పిన బూతు కబుర్లన్నీ ఆసక్తిగా విన్నావుగా?" చిరాగ్గా అడిగాడు.

"అవును. విన్నాను. తప్పే. సారీ. వెళ్ళండి" ప్రాధేయపడింది.

"ఛీ! హాఫ్ డే లీవ్ వేస్ట్" అతను తలుపు తీసి బయటకి వెళ్తూ ధన్‌మని మూసి వెళ్ళాడు.

వెంటనే తలుపుకి లోపలనుంచి బోల్ట్ పెట్టి దానికి జారగిలబడి పెద్ద పెట్టున ఏడ్చింది. వెక్కిళ్ళు పెడ్తూ దాదాపు అరగంట పాటు తనని తాను విశ్లేషించుకుంటూ తిట్టుకుంటూ ఏడుస్తూనే ఉంది.

శ్రీకాంత్ మీద పగసాధించడానికి తను రాజీవ్‌తో స్నేహం చేసిందా? శుభ్రం, పద్ధతి అంటూ కాల్చుకు తింటున్న వాడిని మనసులో ఎగతాళి చేయడానికి ఈ పనిచేసిందా? అన్నీ పర్ఫెక్ట్‌గా ఉండాలనుకునే నీకు, నీ భార్యే పర్ఫెక్ట్‌గా లేదు అని చెప్పడానికి పైశాచికానందంతో ఈ పని చేసిందా? లేక తనలో కామవాంఛ ఎక్కువగా ఉందా? తనని శ్రీకాంత్ సరిగా సంతృప్తి పరచలేకపోతున్నాడా? లేదు లేదు. అతను ఎప్పుడూ పర్ఫెక్టే.

ప్రేమ ఉంటే అతనికి అన్యాయం చేయాలని, వెన్నుపోటు పొడవాలని తాను అనుకునేది కాదు. అంతా శ్రీకాంత్ మూలంగానే. కొద్దిగా, ఆవగింజంతైనా ప్రేమ చూపించి ఉంటే, ఇవాళ ఈ వెధవ ఇంత చనువు తీసుకునేవాడా?

ఏడుస్తూనే లేచి బెడ్‌రూములోకి వెళ్ళి దుప్పటి తీసి, దాన్ని పరుపు మీద కొట్టి కొట్టి దులిపింది. దిళ్ళ కవర్లు తీసి కొత్త దుప్పటి, దిండు కవరు వేసింది. బాత్‌రూంలోకి వెళ్ళి అతను ముద్దు పెట్టిన చెంప మీద డెట్టాల్ బాగా రుద్ది రుద్ది స్నానం చేసి వచ్చింది.

పౌడర్ రాసుకుంటూ అద్దంలో తన మొహం చూసుకుని 'చెడిపోవడానికి కూడా ధైర్యం కావాలి' అనుకుంది.

అరగంట ఆలస్యంగా వచ్చిన శ్రీకాంత్ షూ రేక్‌లో బూట్లు పెట్టి, స్లిప్పర్స్ తీసి వేసుకుని బాత్ రూంలోకి వెళ్ళి స్నానం చేసి వచ్చి టిఫిన్ తింటూ చెప్పాడు.

"రాజీవ్ మధ్యాహ్నం నుంచి వెళ్ళిపోయాడు. అందుకే ఆటోలో వచ్చా. రేపటి నుంచి నేను కొద్దిగా ముందు తయారై వాళ్ళింటికి వెళ్ళి అతన్ని పికప్ చేసుకోవాలి. ఈ రోజుతో నెలయింది మా బైక్ పూల్ మొదలు పెట్టి."

"వారిజా, టీపాయ్ చూడు ఎంత దుమ్ము కొట్టుకుపోయిందో? ఎవరొచ్చినా ఇక్కడే కూర్చుంటారు, డ్రాయింగ్ రూం నీట్‌గా ఉండాలని చెప్పానా? రోజుకోసారి తుడుస్తూంటే ఎంత బావుంటుంది? నీకు బద్ధకం ఎక్కువైంది. మధ్యాహ్నాలు ఏం చేస్తున్నావు?" శ్రీకాంత్ తిట్ల ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

వంట గదిలో అతనికి కేరేజ్ సర్దుతున్న వారిజకి ఈసారి కోపం రాలేదు. 'నాకింతే కావాలి, నాకింతే కావాలి' అని అనుకుంది అంతే!

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

**Click here to share your comments on this story**